సాక్షి
పార్వతీపురం మన్యం

ఆదివారం । 2 । ఏప్రిల్ । 2023



సన్నద్ధం
పదోతరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12.45వరకు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం పరీక్షలు జరుగుతాయి. - 8లో



డిజిటల్ గ్రంథాలయాలకు శ్రీకారం
రాష్ట్రంలో డిజిటల్ గ్రంథాలయం శకం ప్రారంభమైందని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు అన్నారు. - 8లో



జగనన్నను ఆశీర్వదించండి
అన్నివర్గాల ప్రజలకు మంచి చేస్తున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని డిప్యూటీ సీఎం రాజన్నదొర కోరారు. - 8లో



న్యూస్‌రీల్

ఏజెన్సీలో భారీ వర్షం



సీతంపేటలో కురుస్తున్న వర్షం

సీతంపేట/పాలకొండరూరల్: సీతంపేట ఏజెన్సీ, పాలకొండలో శనివారం భారీ వర్షం కురిసింది. లోతట్టుప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం వల్ల జీడిమామిడి పంటకు నష్టం వాటిల్లిందని కొందరు రైతులు గగ్గోలుపెడుతుండగా, వేసవి దుక్కులకు వర్షం ఉపకరిస్తుందని మరికొందరు పేర్కొన్నారు.

రేపటి నుంచి ఒంటిపూట బడులు

పార్వతీపురం: కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు ఈనెల 3 నుంచి అన్ని మేనేజ్‌మెంట్ పాఠశాలలు ఒంటిపూట బడులు నిర్వహించాలని ఆదేశాలు జారీచేసినట్టు డీఈఓ ఎస్‌డీవీ రమణ తెలిపారు. 1 నుంచి 9వ తరగతి వరకు ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు ఒంటిపూట బడులు నిర్వహించాలన్నారు.

6 నుంచి పూర్తిస్థాయిలో ఫ్యామిలీడాక్టర్ సేవలు



ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని పరిశీలిస్తున్న ఆర్‌బీఎస్‌కే జిల్లా సమన్వయకర్త ధవళభాస్కర్

పార్వతీపురంటౌన్: జిల్లాలో ఈ నెల 6 నుంచి పూర్తి స్థాయిలో ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలులోకి వస్తుందని ఆర్‌బీఎస్‌కే జిల్లా సమన్వయకర్త ధవళభాస్కర్ తెలిపారు. మండలంలోని అడ్డాపుశీల గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ సేవలను ఆయన శనివారం పరిశీలించారు. వైద్యసేవలను ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాల్లో మంచానపడిన రోగుల వద్దకు వెళ్లి వైద్యసేవలు అందించే విధానాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి తిరుమల ప్రసాద్, ఎంఎస్‌ఎంలు, ఆశవర్కర్లు, సీహెచ్‌ఓలు, 104 సిబ్బంది, డేటాఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

బిత్రపాడు పరిసరాల్లో గజరాజులు



నిమ్మలపాడు పరిసర పొలాల్లో సంచరిస్తున్న ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని బిత్రపాడు, నిమ్మలపాడు పరిసర ప్రాంతాలలో గజరాజుల గుంపు శనివారం దర్శనమిచ్చాయి. సుమారు మూడు సంవత్సరాల నుండి ఏనుగులు ఇదే ప్రాంతాలలో తిరుగుతూ పంటలను ధ్వంసం చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. అరటి, జొన్న, వరి చేలలో తిరుగుతూ గుమ్మిడిగెడ్డ వాగులలో ఉంటున్నాయని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఏనుగులను తరలించే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రికార్డు స్థాయిలో
పన్నుల వసూలు



పార్వతీపురం పట్టణం

- ఆశాజనకంగా పన్నుల రాబడి
- ఉమ్మడి జిల్లాల డిమాండ్ రూ.59.76 కోట్లు
- వసూలైన మొత్తం రూ.49.87 కోట్లు
- ఫలించిన అధికారులు, సచివాలయ సిబ్బంది కృషి
- మార్చి 31తో ముగిసిన బకాయి పన్నులపై వడ్డీ మాఫీ ఆఫర్



కార్పొరేషన్ కార్యాలయంలో ఆస్తిపన్ను చెల్లిస్తున్న ప్రజలు

విజయనగరం: విజయనగరం ఉమ్మడి జిల్లాలోని నగరాలు, పట్టణాల్లో ఆస్తి పన్ను వసూలు రికార్డుస్థాయిలో జరిగింది. గత ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే 2022–23 ఆర్థిక సంవత్సరంలో మొండి బకాయిదారుల నుంచి పన్నుల వసూలకు అధికారులు, సచివాలయ సిబ్బంది కృషి ఫలించింది. ప్రభుత్వం ప్రకటించిన పన్ను బకాయిలపై వడ్డీ మాఫీ ఆఫర్‌ను పన్నుచెల్లింపుదారులు సద్వినియోగం చేసుకున్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలోని 7 పట్టణ ప్రాంతాల్లో పన్నులు ఆశాజనంగా వసూలయ్యాయి. ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి విజయనగరం, పార్వతీపురంమన్యం జిల్లాల్లోని కార్పొరేషన్, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఆస్తిపన్ను డిమాండ్ రూ.59.76 కోట్లు కాగా... రూ.49.87 కోట్లు వసూలైంది. విజయనగరం జిల్లాలోని నెల్లిమర్ల నగర పంచాయతీలో 100 శాతం ఆస్తి పన్నులు వసూలు చేయగా... పార్వతీపురంమన్యం జిల్లాలోని పాలకొండలో 99.90 శాతం పన్నులు వసూలైనట్టు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. జిల్లా కేంద్రమైన విజయనగరం కార్పొరేషన్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా 79.90 శాతం పన్నులు వసూలు కావడం గమనార్హం. ఇదిలా ఉండగా ప్రభుత్వం ప్రకటించిన బకాయిలపై వడ్డీ మాఫీ ఆఫర్ శుక్రవారంతో ముగిసిందని, ఇప్పటి వరకు పన్ను బకాయిలు చెల్లించని వారు వడ్డీతో సహా చెల్లించాల్సి ఉంటుందని అధికారులు స్పష్టంచేశారు.

బకాయిల వసూలు



గత ఆర్థిక సంవత్సరాలతో పోల్చుకుంటే 2022–23 ఆర్థిక సంవత్సరంలో పన్నులు చెల్లించేందుకు ప్రజలు ముందుకొచ్చారు. ఆస్తిపన్ను బకాయిలపై ప్రభుత్వం ప్రకటించిన వడ్డీ మాఫీ ఆఫర్‌ను సద్వినియోగం చేసుకున్నారు. పార్వతీపురం మున్సిపాలిటీలో 95 శాతంమేర పన్నులు వసూలు చేశాం. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులపై పన్ను బకాయిలు వసూలయ్యాయి. పన్నుల వసూలలో మున్సిపల్ సిబ్బంది, అధికారుల కృషి ఫలించింది. రీజియన్ పరిధిలో పన్నుల వసూలలో పార్వతీపురం పట్టణం ఐదో స్థానంలో నిలిచింది.

– రామప్పలనాయుడు, కమిషనర్, పార్వతీపురం మున్సిపాలిటీ

పన్నుచెల్లింపుదారులకు ఊరట కల్పిస్తూ...

గత కొన్ని ఆర్థిక సంవత్సరాలుగా పన్నుల వసూలు ఆశించిన మేర జరగకపోవడంతో బకాయిల మొత్తం రూ.కోట్లలో పేరుకుపోయాయి. దీనిపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం ఆర్థిక సంవత్సరంలో 100 శాతం పన్ను బకాయిలు వసూలు చేయాలని స్థానిక సంస్థలకు, అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు పన్ను చెల్లింపుదారులకు వడ్డీమాఫీ ఆఫర్‌ను ప్రకటించింది. మున్సిపల్ రెవెన్యూ విభాగంతో పాటు క్షేత్రస్థాయిలో ఉండే సచివాలయ సిబ్బంది మూడు నెలలుగా పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించారు. విజయనగరం జిల్లాలోని విజయనగరం కార్పొరేషన్, బొబ్బిలి మున్సిపాలిటీ, నెల్లిమర్ల, రాజాం నగర పంచాయతీల్లో మొత్తం 91,614 అసెస్‌మెంట్‌ల నుంచి రూ.51.51 కోట్లు వసూలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించగా, శుక్రవారం అర్ధరాత్రికి రూ.42.03 కోట్లు వసూలు చేయగలిగారు. పార్వతీపురం, సాలూరు మున్సిపాలిటీలతో పాటు పాలకొండ నగర పంచాయతీ పరిధిలో 31,590 అసెస్‌మెంట్‌ల నుంచి రూ.8.25 కోట్లు వసూలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించగా... రూ.7.84 కోట్లు వసూలైంది. రానున్న ఆర్థిక సంవత్సరంలో పన్నుల వసూలు ప్రక్రియ సులభతరమవుతుందన్న భావన వ్యక్తమవుతోంది.

విజయనగరం ఉమ్మడి జిల్లాలో ఆస్తి పన్ను వసూలు ఇలా...

ప్రాంతం	అసెస్‌మెంట్‌లు	డిమాండ్	వసూలు	శాతం
విజయనగరం	63,105	రూ.43.49 కోట్లు	రూ.37.99కోట్లు	79.90
రాజాం	11,622	రూ.2.55 కోట్లు	రూ.2.19 కోట్లు	85.80
బొబ్బిలి	11,979	రూ.4.22 కోట్లు	రూ.3.81 కోట్లు	90.20
నెల్లిమర్ల	5,208	రూ.1.26 కోట్లు	రూ. 1.26 కోట్లు	100
పార్వతీపురం	12,735	రూ. 4.06 కోట్లు	రూ.3.86 కోట్లు	95.10
సాలూరు	11,532	రూ. 2.32 కోట్లు	రూ.2.10 కోట్లు	90.30
పాలకొండ	7323	రూ. 1.88 కోట్లు	రూ.1.88 కోట్లుబ	99.90

పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పన



కేపీఎం ఉన్నత పాఠశాలలో సౌకర్యాలపై ఆరా తీస్తున్న డీఈఓ రమణ

పార్వతీపురం: పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చర్యలు చేపడుతున్నట్లు డీఈఓ ఎస్‌డీవీ రమణ తెలిపారు. పట్టణంలోని సెంట్‌పీటర్స్, కేపీఎం, ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 3 నుంచి నిర్వహించనున్న పరీక్షల్లో ఎలాంటి అసౌకర్యం లేకుండా తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. పరీక్ష కేంద్రం వద్ద 144సెక్షన్ విధించడంతో పాటు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల సమీపంలో జెరాక్స్ సెంటర్లను తెరిచేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఏఎంఓ సీహెచ్ శ్రీనివాసరావు ఉన్నారు.

క్షేత్రస్థాయి పర్యటనలో ఐఎఫ్ఎస్ అభ్యర్థులు



ఐఎఫ్ఎస్ అభ్యర్థులతో సమీక్షిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: ఇండియన్ ఫారిన్ సర్వీస్(ఐఎఫ్ఎస్) 2022 బ్యాచ్‌కు చెందిన అభ్యర్థులు పూసపాటి సాహిత్య (విశాఖపట్నం), డీఎస్‌వీ అశోక్(కాకినాడ)లు కలెక్టర్ నిషాంత్‌కుమార్, ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడును కలెక్టర్ కార్యాలయంలో శనివారం కలిశారు. క్షేత్రస్థాయి శిక్షణ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో పర్యటించారు. పరిపాలన పరమైన అంశాలను వారికి కలెక్టర్, ఎస్పీ వివరించారు. జిల్లాలో చేపడుతున్న వివిధ పనులు, కార్యక్రమాలను తెలియజేశారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రజల జీవన విధానాన్ని వివరించారు. అనంతరం గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో పర్యటించారు. కార్యక్రమంలో టీపీఎంయూ ఏపీడీ వై.సత్యంనాయుడు పాల్గొన్నారు.

జర్నలిజం డిప్లమా కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: జర్నలిజం డిప్లమా కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఏపీ సమాచార పౌరసంబంధాల అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రెస్‌అకాడమీ ద్వారా ఈ కోర్సును నిర్వహిస్తామన్నారు. ఈనెల 15లోగా వెబ్‌సైట్ ప్రెస్‌అకాడమీ.ఏపీ.జీఓవీ.ఇన్‌లో దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకొని సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 91541 04393 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

సమాజంలో అంతా ఒక్కటే...



మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: అంటరాని తనం, కులవివక్ష వంటి సంఘటనలు జరిగితే వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంటరాని తనం, అత్యాచారం, దాడులకు గురైన బాధితులకు సత్వర న్యాయం, పరిహారం అందించాలన్నారు. జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ ఏర్పాటైనప్పటి నుంచి నమోదైన 10 కేసుల ప్రస్తుత పరిస్థితిపై కేసుల వారీగా సమీక్షించారు. కేసులు నమోదులో జాప్యం ఉండకూడదని, కేసు నమోదుకు అవసరమైన ధ్రువపత్రాలు వెంటనే బాధితులకు అందించాలని అధికారులను ఆదేశించారు. డివిజన్ స్థాయి సమావేశాలు నిర్వహించి కేసులపై సమీక్ష నిర్వహించాలన్నారు. అంటరానితనంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు మాట్లాడుతూ జిల్లాలో నమోదైన కేసులపై త్వరితగతిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నమోదైన పది కేసుల్లో తొమ్మిది విచారణ దశలో ఉండగా, ఒక కేసు కోర్టులో ట్రైల్ దశలో ఉందన్నారు.

సమావేశంలో జేసీ ఒ.ఆనంద్, సబ్ కలెక్టర్ నూరల్ కమర్, డీఆర్ఓ జె.వెంకటరావు, అడిషనల్ ఎస్పీ ఒ.దిలీప్‌కిరణ, సివిల్ సప్లై డీఎం ఎం.దేవ్లానాయక్, పశుసంవర్ధక శాఖాధికారి ఎ.ఈశ్వరరావు, అగ్నిమాపక శాఖాధికారి శ్రీనిబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జస్టిస్ మన్మధరావుకు ఘన స్వాగతం



జస్టిస్ కె.మన్మధరావుకు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న డీఆర్‌ఓ గణపతిరావు

విజయనగరం అర్బన్: జిల్లా పర్యటన నేపథ్యంలో నగరానికి శనివారం వచ్చిన గౌరవ జస్టిస్ కె.మన్మధరావుకు జిల్లా యంత్రాంగం ఘన స్వాగతం పలికింది. స్థానిక జిల్లా పరిషత్ అతిథిగృహంలో ఆయనను జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆదివారం జిల్లా కోర్టులో న్యాయవాదులకు నిర్వహించే అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొననున్నట్లు తెలిపారు.

రేషన్ బియ్యం పంపిణీ ప్రారంభం

విజయనగరం అర్బన్: తెల్ల రేషన్ కార్డుదారులకు ఏప్రిల్ నెలకు సంబంధించిన రేషన్ బియ్యం పంపిణీ శనివారం ప్రారంభమైందని పౌర సరఫరాల జిల్లా అధికారి కె.మధుసూదనరావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 5.78 లక్షల తెల్ల రేషన్‌కార్డుదారులకు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనశాలకు, ఐసీడీఎస్ అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ కోసం 1,249 డిపోల ద్వారా 370 ఎండీయూ వాహనాలు ఉన్నాయని తెలిపారు. ఈ నెల 15లోగా ఇళ్లకు పంపిణీ చేసే ప్రక్రియ సకాలంలో పూర్తి చేస్తామని తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యా యత్నం



చికిత్స పొందుతున్న మణికంఠ

పార్వతీపురం: ఓ వ్యక్తి మనస్తాపానికి గురై ఎలుకల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. పార్వతీపురం అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు.. పార్వతీపురం పట్టణంలోని విజయరామరాజు కాలనీకి చెందిన ఆర్.మణికంఠ ఎలుకల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. తన భార్యతో గత కొంతకాలంగా గొడవలు పడుతున్నాడు. ఈ మేరకు మనస్తాపానికి గురై ఎలుకల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి చికిత్స కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు అవుట్ పోస్టు పోలీసులు తెలిపారు.

కారు బోల్తా పడి ఎంపీపీకి గాయాలు



ప్రమాదంలో బోల్తా పడిన కారు

బొండపల్లి: మండల కేంద్రం నుంచి తన కారులో విజయనగరం వెళ్తుండగా జాతీయ రహదారి 26పై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎంపీపీ చల్లా చలంనాయుడు స్వల్పంగా గాయపడ్డారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలు.. తన కారులో ఎంపీపీ చలంనాయుడు విజయనగరం బయలుదేరారు. మార్గంలో నెలివాడ - అంబటివలస గ్రామాల మధ్య కారుకు కుక్క అడ్డు రావడంతో తప్పించే ప్రయత్నంలో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎంపీపీకి స్వల్ప గాయాలయ్యాయి.

వాటర్ ప్లాంట్‌ల పరిశీలన

భోగాపురం: మండల కేంద్రంలో వ్యాపారులు నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్‌లను మెట్రాలజీ ఫుడ్ సేఫ్టీ అధికారులు శనివారం పరిశీలించారు. పరిశ్రమల శాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగేశ్వరరావు, నరసింగరావు వాటర్ ప్లాంట్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150-00
బంగారం(22సి. 10గ్రా.)	51,800-00
వెండి (కిలో)	71,200-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹100	₹170	₹ 180

సన్నద్ధం

పదో తరగతి పరీక్షలకు రంగం సిద్ధమైంది. ఇటు అధికారులు పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయగా.. అటు విద్యార్థులు ఏడాదంతా కష్టపడి చదివిన దానిని రాసేందుకు సిద్ధమయ్యారు.

- రేపటి నుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలు
- జిల్లా వ్యాప్తంగా 127 కేంద్రాలు
- ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 7, సిట్టింగ్ స్క్వాడ్‌లు 35- 1311 మంది ఇన్విజిలేటర్లు
- పరీక్షలు రాయనున్న విద్యార్థులు 25,527 మంది
- డీఈఓ కార్యాలయంలో కంట్రోల్ రూమ్



పదవ తరగతి పరీక్ష రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

విజయనగరం పూల్‌బాగ్: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12.45వరకు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం పరీక్షలు జరుగుతాయి. పరీక్ష కేంద్రాలకు అరగంట ముందుగా చేరుకునేలా ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

127 కేంద్రాలు.. 25,527 మంది విద్యార్థులు

పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు జిల్లాలో 127 కేంద్రాలను కేటాయించారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 432 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 25,527 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. వీరిలో రెగ్యులర్ స్టూడెంట్స్ 24,099 మంది కాగా అందులో బాలురు 12272, బాలికలు 11828 మంది, ప్రైవేటు విద్యార్థులు 1428 మంది ఉన్నారు. అందులో బాలురు 975, బాలికలు 453 మంది, మొత్తంగా 25,527 మంది(13,246బాలురు, 12,281 బాలికలు) ఉన్నారు. అలాగే పరీక్షల నిర్వహణకు సంబంధించి ఏ కేటగిరీ సెంటర్లు 58, బీ కేటగిరీ సెంటర్లు 34, సీ కేటగిరీ సెంటర్లు 35 ఏర్పాటు చేశారు. 7 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 35 సిట్టింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేశారు. 29 స్టోరేజ్ పాయింట్లు, 1311 మంది ఇన్విజిలేటర్లను నియమించారు.

ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం

పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల రాకపోకలకు వీలుగా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకున్నారు. అన్ని రూట్లలో ఎక్కువ సంఖ్యలో బస్సులు నడపనున్నారు. హాల్ టిక్కెట్ ఉన్న అభ్యర్థులు అన్ని పరీక్షల రోజుల్లో వారి నివాసం నుండి పరీక్ష కేంద్రానికి ఉచితంగా ప్రయాణించడానికి అనుమతిస్తారు. ఎండల దృష్ట్యా విద్యార్థులు అస్వస్థతకు అనారోగ్యానికి గురికాకుండా పరీక్ష కేంద్రాల్లో ఏఎన్‌ఎంల నియామకంతో పాటు తగిన మెడికల్ కిట్లను వైద్య శాఖ ఏర్పాటు చేసింది. మొబైల్ మెడికల్ వాహనాలు కూడా అందుబాటులో ఉంటాయి. అన్ని పరీక్ష కేంద్రాల్లో ఫర్నిచర్‌తో పాటు వెంటిలేషన్, పరిశుభ్ర వాతావరణం ఉండేలా విద్యా శాఖ చర్యలు తీసుకుంది. శాంతిభద్రతల నిర్వహణకు అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను ఏర్పాటు చేశారు. పరీక్ష సమయంలో సమీపంలోని జిరాక్స్, నెట్ సెంటర్లు మూసి ఉంచేలా చర్యలు తీసుకోనున్నారు. అలాగే పరీక్ష కేంద్రాలకు పరీక్షలు జరిగినన్ని రోజులూ నిరంతరాయంగా విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకున్నారు.

మొబైల్‌ఫోన్‌లు నిషేధం




చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటల్ ఆఫీసర్‌తో సహా, ఎవరూ మొబైల్ ఫోన్‌లను పరీక్ష కేంద్రాలకు తీసుకురాకూడదు. ల్యాప్‌ట్యాప్‌లు, ట్యాబ్‌లు, కెమెరాలు, ఇయర్‌ఫోన్స్, స్పీకర్లు, స్మార్ట్‌వాచ్‌లు, బ్లూటూత్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురాకూడదు. పరీక్షల నిర్వహణకు 7 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 35 సిట్టింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేశారు. 29 స్టోరేజ్ పాయింట్లు, 1311 మంది ఇన్విజిలేటర్లను ఏర్పాటు చేశాం.

– బి.లింగేశ్వరరెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి, విజయనగరం

జగనన్నను ఆశీర్వదించండి

- నిప్పుపెట్టడం, నీళ్లు పోయడం టీడీపీ నైజం
- రైతులు, డ్వాక్రా మహిళలను ఎవరు మోసం చేశారో అందరికీ తెలిసినదే..
- డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కును అందజేస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: అన్నివర్గాల ప్రజలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిను వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర కోరారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన శనివారం నిర్వహించిన వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆసరా లబ్ధి చెక్కును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే సీఎం లక్ష్యమన్నారు. అందుకే పిల్లలకు నాణ్యమైన విద్యను చేరువచేస్తున్నారన్నారు. మహిళల ఆర్థికోన్నతికి వివిధ సంక్షేమపథకాలు అమలుచేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలోని సుమారు 5 కోట్ల 48 లక్షల మంది మహిళలకు ఇప్పటివరకు వివిధ పథకాల ద్వారా సుమారు రూ.2లక్షల25 కోట్ల ఆర్థిక లబ్ధికల్పించినట్టు వెల్లడించారు. సాలూరు మున్సిపాలిటీలో 16,600 మంది లబ్ధిదారులకు రూ.163 కోట్ల ఆర్థిక ప్రయోజనం కల్పించారన్నారు. 2014 ఎన్నికల్లో ఓట్లువేసిన రైతులు, డ్వాక్రామహిళల రుణాలు మాఫీ చేయకుండా చంద్రబాబునాయుడు మోసం చేసిన విషయాన్ని ఎవరూ మరచిపోలేదన్నారు. నిరుద్యోగ భృతి ఇవ్వకుండా యువతను మోసం చేసిన చరిత్ర చంద్రబాబుదని ఎద్దేవా చేశారు. బోయవాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడంపై టీడీపీ చేస్తున్న రాద్ధాంతాన్ని ఉద్దేశించి నిప్పు పెట్టడం, ఆపై నీళ్లు చల్లడం టీడీపీ నైజమని పేర్కొన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ, అభివృద్ధి పాలనను మనసులో పెట్టుకుని వచ్చే ఎన్నికల్లో ఓటు హక్కుతో ఆశీర్వదించాలని కోరారు. అనంతరం సీఎం చిత్రపటానికి మహిళలు పూల, క్షీరాభిషేకాలు చేశారు. థాంక్యూ సీఎం సార్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ జర్జాపుదీప్తి, వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కౌన్సిలర్లు జర్జాపు ఈశ్వరరావు, గిరిరఘు, గొర్లె జగన్, మెప్మా సిబ్బంది, వేలాదిమంది డ్వాక్రామహిళలు పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు

ఆర్థికోన్నతి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ఆర్థికోన్నతి సాధించాం. జీవనోపాధులు మెరుగుపడ్డాయి. మహిళల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉంటాం.

– ఎమ్.సూరీడమ్మ, వైఎస్సార్ ఆసరా లబ్ధిదారు, సాలూరు

జగనన్నే మాకు అండ



జగనన్న మా మహిళలకు అన్నివిధాలా అండగా నిలుస్తున్నారు. మాకు మేలుచేస్తున్న ముఖ్యమంత్రిని మర్చిపోలేము. మరలా జగన్‌మోహన్‌రెడ్డిను ముఖ్యమంత్రిగా చేసుకుంటాం.

– బి.సత్యవతి, డ్వాక్రామహిళ, సాలూరు

రుణపడి ఉంటాం



మాకు మంచి చేస్తున్న జగనన్న రుణం తీర్చుకోలేము. జగనన్న పాలనలో మహిళలు ఆర్థికంగా రాణించాలని అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. థాంక్యూ సీఎం సార్.

– ఎల్.రాము, వైఎస్సార్ ఆసరా లబ్ధిదారు, సాలూరు

డిజిటల్ గ్రంథాలయాలకు శ్రీకారం

- రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ శేషగిరిరావు
- 'మనం మన గ్రంథాలయం' కార్యక్రమం ప్రారంభం



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పుస్తకాల అలమరను పరిశీలిస్తున్న రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ శేషగిరిరావు

విజయనగరం అర్బన్: రాష్ట్రంలో డిజిటల్ గ్రంథాలయం శకం ప్రారంభమైందని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా శనివారం నగరానికి వచ్చిన ఆయన స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని సందర్శించారు. తొలిత గ్రంథాలయంలోని గ్రంథ, పుస్తక అలమరలను పరిశీలించారు. గ్రంథాలయ సందర్శకుల సంఖ్యను తెలుసుకొని వారు చదివే పుస్తకాల అభిరుచిని తెలుసుకున్నారు. గ్రంథాలయంలో పఠనకు వచ్చిన విద్యార్థులతో మాట్లాడారు. పరిసరాలు, పుస్తకాల అలమరలను శుభ్రం చేసి చూపించారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న 'మనం మన గ్రంథాలయం' అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రతి నెల మొదటి శనివారం అన్ని గ్రంథాలయాలు ఒక స్ఫూర్తిదాయకమైన కార్యక్రమంగా తీసుకురావడం జరుగుతుందన్నారు. మన ఇంటిని ఏ విధంగా సొంతంగా భావించి శుభ్రంగా ఉంచుకుంటామో అదే విధంగా గ్రంథాలయాలను దేవాలయాలుగా ఉంచుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని గ్రంథాలలో డిజిటల్ విభాగాన్ని ఏర్పాటు చేయడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. గ్రంథాలయాల విశిష్టతను పాఠకులకు, ప్రజలకు తెలియజేయాలనే స్ఫూర్తిని తీసుకొని గ్రంథాలయ జిల్లా చైర్మన్, కార్యదర్శి కలిసి ఈ కార్యక్రమాన్ని ప్రతి గ్రంథాలయంలో చేపట్టే విధంగా ప్రణాళికలు వేశామన్నారు. డిజటల్ గ్రంథాలయ సౌకర్యాలను రాష్ట్ర వ్యాప్తంగా 9,500 గ్రంథాలయాలో ఏర్పాటు చేయడానికి రంగం సిద్ధం చేశామని చెప్పారు. ఇటీవల అన్నవరంలో తొలిత ప్రారంభించామని అన్నారు. విద్యా వ్యవస్థలో మాదిరిగానే 'నాడు నేడు' కార్యక్రమాన్ని గ్రంథాలయాలలో చేపడుతున్నామని వెల్లడించారు. ఉన్నతమైన ఆలోచనలతో గ్రంథాలయాలను డిజిటలైజేషన్ చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి అని కొనియాడారు. ఈ నేపథ్యంలోనే ఈ ఏడాదిని 'జగన్మోహన్ డిజిట్ శుభకృతి నామ సంవత్సరం'గా గ్రంథాలయ సంస్థ ప్రకటించిందని తెలిపారు. ఈ సంవత్సరం అంతా అదే స్ఫూర్తితో ముందుకు వెళ్లడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి, కార్యదర్శి ఎస్.లలిత, డిప్యూటీ లైబ్రేరియన్ లక్ష్మి, సహాయ గ్రంథాలయ అధికారి కె.శ్రీనివాసరావు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డిజిటల్ గ్రంథాలయాలు సీఎం లక్ష్యం

బాడంగి: రాష్ట్రంలో డిజిటల్ గ్రంథాలయాలను ఏర్పాటు చేయాలన్నదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా చర్యలు చేపట్టినట్టు రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైరమన్ మందపాటి శేషగిరిరావు చెప్పారు. బాడంగి గ్రంథాలయాన్ని ఆయన శనివారం సందర్శించారు. గ్రంథాలయంలో విద్యార్థులకు కంప్యూటర్ నేర్పించడం, వేసవి తరగతులు ప్రారంభించడాన్ని మెచ్చుకున్నారు. పాఠకుల హాజరు పెంచేలా కృషి చేయాలని సూచించారు. అనంతరం పిన్నవలసలో నిర్మాణంలో ఉన్న డిజిటల్ గ్రంథాలయాన్ని జెడ్పీటీసీతో కలిసి తిలకించారు. ఆయన వెంట గ్రంథాలయాధికారి దుర్గాప్రసాద్ ఉన్నారు.

ప్రజలకు మెరుగైన న్యాయ సేవలందించండి



బార్ కౌన్సిల్ నూతన కార్యవర్గ సభ్యులతో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

- జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- బార్ కౌన్సిల్ నూతన కార్యవర్గ సభ్యులకు సత్కారం

విజయనగరం: ప్రజాస్వామ్యంలో న్యాయవ్యవస్థకు అత్యున్నత స్థానం ఉన్నదని అటువంటి వ్యవస్థలో భాగస్వామ్యం వహిస్తున్న న్యాయవాదులు జిల్లా ప్రజలకు మంచి సేవలను అందించాలని విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆకాంక్షించారు. శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బార్ కౌన్సిల్ ఎన్నికల్లో ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులను చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా బార్ కౌన్సిల్‌కు ఎన్నిక కాబడ్డ సభ్యులకు అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం న్యాయవ్యవస్థలోకి రాబోయే తరాలను ప్రోత్సహించటంలో భాగంగా జూనియర్ లాయర్లకు వైఎస్సార్ లా నేస్తం కింద ప్రతి ఏటా రూ.5వేల ప్రోత్సాహం అందిస్తుందని గుర్తు చేశారు. కార్యక్రమంలో బార్ కౌన్సిల్ అధ్యక్షులు సిహెచ్.దామోదర్, ఉపాధ్యక్షులు ఏఎస్‌వీ అంజనీకుమార్, క్రీడలు/సాంస్కృతిక విభాగం కార్యదర్శి పి.కుమార్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

వసుధైక కుటుంబ సాధనలో యువత కీలకం

- గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కట్టిమణి



మాట్లాడుతున్న గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కట్టిమణి

విజయనగరం అర్బన్: భారతదేశం భిన్నత్వంలో ఏకత్వంతో కూడిన వసుధైక కుటుంబమని దాన్ని కొనసాగించే బాధ్యత యువతదేనని కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ తేజస్వి కట్టిమణి అన్నారు. అజాదీకా అమృత్ మహోత్సవాన్ని పురస్కరించుకొని వివేకానంద ఫర్ కల్చర్ యోగ అండ్ మేనేజ్‌మెంట్ ఒడిశా సౌజన్యంతో స్థానిక గిరిజన యూనివర్సిటీలో 'సివిల్ సొసైటీ - 20' శనివారం నిర్వహించిన జీ-20 సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకరికి ఒకరు సహకారం అందించుకొని మానవ మనుగడకు సహకరించుకోవాలని భగవద్గీత, ఉపనిషత్తులలో తెలిపారని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ హక్కులను గురించి మాట్లాడమే కాకుండా తమ బాధ్యతలను కూడా నిబద్ధతతో నిర్వహించాలని కోరారు. అనంతరం విద్యార్థులు వసుధైక కుటుంబం సాధనకు వివిధ సలహాలు సూచనలతో కూడిన ప్రెజెంటేషన్స్ ఇచ్చారు. కార్యక్రమానికి సమన్వయకర్తగా డాక్టర్ కుసుమ్ వ్యవహరించారు. కార్యక్రమంలో అరుణాచల్‌ప్రదేశ్ వివేకానంద కేంద్ర జీవనవర్తి కార్యకర్త లక్ష్మీనారాయణ, సుజాత, వివేకానంద ఫర్ కల్చర్ యోగ అండ్ మేనేజ్‌మెంట్ ఒడిశా, ఆంధ్రప్రదేశ్ ప్రాంత కార్యకర్త రవి, ప్రొఫెసర్ మిశ్రా, ప్రొఫెసర్ శరత్‌చంద్రబాబు, ప్రొఫెసర్ శ్రీనివాసన్, డాక్టర్ అప్పాసాభా అధితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలి..

- విశాఖ స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్ పార్థసారథి ఘోష్



మాట్లాడుతున్న విశాఖ స్టీల్‌ప్లాంట్ జీఎం పార్థసారథి ఘోష్

డెంకాడ: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకుని, వాటి సాధనకు నిరంతరం పరితపించాలని విశాఖ స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్ పార్థసారథి ఘోష్ అన్నారు. జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ విభాగం విద్యార్థి సంఘం విధాత్రి ఆధ్వర్యంలో శనివారం యువజనోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మారుతున్న కాలానికి అనుగుణంగా.. ప్రజల అవసరాలు, ఆలోచనలకు అనుగుణంగా సృజనాత్మక ఆలోచనలతో ముందుకు సాగాలన్నారు. అనంతరం 3డీ ప్రింటింగ్ క్లబ్‌ను ప్రారంభించారు. గౌరవ అతిథి విశాఖ స్టీల్‌ప్లాంట్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎస్. దీప్లానాయక్ మాట్లాడుతూ, విద్యార్థులు ఏదైనా సాధించాలంటే ముందుగా నేర్చుకోవాలన్న తపన ఉండాలన్నారు. నాయకత్వ లక్షణాలు, భావ వ్యక్తీకరణ చాలా ముఖ్యమని తెలిపారు. అనంతరం నిర్వాహకులు అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి, విభాగాధిపతి సతీష్‌పూజారి, వైస్ ప్రిన్సిపాళ్లు టి.హరిబాబు, ఏవీ పరాంకుశం, విభాగాధిపతులు జి.ప్రకాష్‌బాబు, రాజన్‌బాబు, రామారావు, రాజేంద్ర, సుబ్బరామయ్య, దుర్గాశైలజ, సతీష్, వివిధ ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన విద్యార్థులు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగులు

రాజాం: సీఎంఆర్‌ఎఫ్(ముఖ్యమంత్రి సహాయ నిధి) పేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మండలంలోని బూరాడపేటకు చెందిన బూరాడ ప్రకాష్‌కు మంజూరైన రూ.1.50 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే శనివారం అందజేశారు. గతంలో తన కుడికాలికి తీవ్రగాయం కాగా అప్పట్లో తన కాలికి జరిగిన చికిత్సకు ఆరోగ్యశ్రీ వర్తించలేదని, ఈ క్రమంలో తన సొంత డబ్బులతో ఆపరేషన్ చేయించుకున్నానని, ఈ నగదు కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా, ఇప్పుడు వచ్చిందని సంతోషంగా ఉందని లబ్ధిదారు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాజాం రూరల్ కన్వీనర్ ఎల్.రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బి.నర్సింహులు, సర్పంచ్ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.